# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం - 04- సెప్టెంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 92 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in




# స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన సీఎం

## రూ.620 కోట్ల వ్యయంతో నిర్మితమైన 3.2 కిలోమీటర్ల ఫ్లైఓవర్

- నగర ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం దిశగా కీలక అడుగు
- ఫోటో ప్రదర్శనను పరిశీలించిన ముఖ్యమంత్రి

**హైదరాబాద్, సెప్టెంబర్ 3, (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ నగర మౌలిక వసతుల అభివృద్ధిలో మరో కీలక ఘట్టంగా చంచల్‌గూడ - సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు ప్రజలకు వేగవంతమైన రవాణా సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. ఫ్లైఓవర్ ప్రారంభంతో పాతనగర ప్రాంత ప్రజలకు ప్రయాణ సమయం తగ్గడంతో పాటు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

రూ.620 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ స్టీల్ ఫ్లైఓవర్ మొత్తం 3.2 కిలోమీటర్ల పొడవుతో రూపొందించబడింది. హైదరాబాద్‌లో పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకుని నిర్మించిన ఈ ప్రాజెక్టు నగర రవాణా వ్యవస్థకు గణనీయమైన ఊతమివ్వనుంది. ముఖ్యంగా చంచల్‌గూడ, సంతోష్‌నగర్, నల్గొండ క్రాస్‌రోడ్స్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం అనంతరం

మిగతా 2లో

# కొండా సురేఖ బర్తరఫ్‌కు సీఎం సిఫార్సు

## గవర్నర్‌కు లేఖ పంపిన రేవంత్ రెడ్డి

## రాజీనామాకు నిరాకరించడంతో కీలక నిర్ణయం

### ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి చిన్నారెడ్డి తొలగింపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 3, (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు సిఫార్సు చేశారు. ఇందుకు సంబంధించిన లేఖను గవర్నర్‌కు పంపించారు. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి అనుమతి లభించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గవర్నర్ ఆమోదం తెలిపిన వెంటనే కొండా సురేఖ మంత్రి పదవి నుంచి అధికారికంగా తప్పుకోనున్నారు. అనంతరం ఆమె ఎమ్మెల్యేగా మాత్రమే కొనసాగనున్నారు. ఇటీవల కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారంపై పార్టీ క్రమశిక్షణ కమిటీ సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అనంతరం ఆమె నుంచి వివరణ తీసుకుని నివేదికను అధిష్ఠానానికి పంపింది. ఈ నేపథ్యంలో సురేఖను స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని పార్టీ పెద్దలు సూచించినట్లు తెలిసింది. అయితే ఆమె అందుకు అంగీకరించకపోవడంతో బర్తరఫ్ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.



**- ఢిల్లీలో నాటకీయ పరిణామాలు**

గత రెండు రోజులుగా ఢిల్లీలో జరిగిన పరిణామాలు కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ రేపాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమైన కొండా సురేఖ తన వాదనలు వినిపించారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని, తనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటే ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారాన్ని కూడా పరిశీలించాలని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే అధిష్ఠానం చివరకు కఠిన నిర్ణయానికే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

మిగతా 8లో



# ఉచిత పోలీసు కోచింగ్ శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి పొంగులేటి

- నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలే లక్ష్యం
- పట్టుదలతో కృషి చేస్తే విజయం సాధ్యం
- అభ్యర్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యం
- శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచన

**ఖమ్మం, సెప్టెంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**

నిరుద్యోగ యువతీ యువకులు పట్టుదలతో కృషి చేసి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే భవిష్యత్తులో ఉద్యోగులుగా, అధికారులుగా స్థిరపడగలరని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో గల రామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, రైట్ ఛాయిస్ నిర్వహణలో

మిగతా 2లో

# పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణకు శ్రీకారం

- అభ్యర్థులకు అధ్యయన సామగ్రి పంపిణీ చేసిన మంత్రి సీతక్క
- యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం
- కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల సాధనకు ప్రత్యేక శిక్షణ
- విజయం సాధించే వరకు నిరంతరం ప్రయత్నించాలని సూచన

**ములుగు, సెప్టెంబర్ 03, (తెలంగాణ ముచ్చట్లు):**

కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు ప్రోత్సాహం అందించేందుకు ములుగు ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి అనసూయ సీతక్క శిక్షణ పొందనున్న

మిగతా 2లో



# బర్తరఫ్ నిర్ణయంపై కొండా సురేఖ ఆవేదన

- తనకు సమాచారం ఇవ్వకుండా తొలగించారని విమర్శ
- ముఖ్యమంత్రి తీరుపై అసంతృప్తి వ్యక్తం
- కాంగ్రెస్‌లో అంతర్గత పరిస్థితులపై సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 3, (తెలంగాణ ముచ్చట్లు):**

మంత్రి పదవి నుంచి తనను తొలగించిన విధానం బాధాకరమని ఎమ్మెల్యే కొండా సురేఖ పేర్కొన్నారు. తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బర్తరఫ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఢిల్లీలో ఉన్నప్పటికీ ఈ విషయాన్ని తనతో పంచుకోలేదని అన్నారు. తనను ఏ కారణంతో పదవి నుంచి తొలగించారో ఇప్పటికీ స్పష్టత లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానానికి తనను తొలగించాలనే ఉద్దేశం లేదని, ముఖ్యమంత్రి పట్టుబట్టడంతోనే ఈ నిర్ణయం జరిగిందని ఆరోపించారు. తనపై కావాలనే కక్ష సాధింపు చర్యలు చేపట్టారని కొండా సురేఖ విమర్శించారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలు కష్టపడి పనిచేసిన తనను ఈ విధంగా పక్కనపెట్టడం బాధ కలిగించిందన్నారు. తనను బర్తరఫ్ చేయడంపై సరైన వివరణ ఇవ్వకుండా నిర్ణయం తీసుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు.

మిగతా 8లో

# డ్రగ్స్ వినియోగదారులపై పోలీసుల ఉక్కుపాదం


- ఇక డ్రగ్ టెస్ట్ తప్పనిసరి
- పాజిటివ్ వస్తే ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు
- మాదకద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు



2లో

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై హరీశ్‌రావు ఫైర్

- హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశారన్న మాజీ మంత్రి
- కౌడిపల్లి వేదికగా సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ సవాల్
- రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ అంశాలపై తీవ్ర విమర్శలు
- 22-ఎ భూములు, పీఏసీఎస్ అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్



**మెదక్, సెప్టెంబర్ 03, (తెలంగాణ ముచ్చట్లు):**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలను ఎండగడుతూ నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కౌడిపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన భారీ నిరసన

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన సీఎం



(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోటో ప్రదర్శనను ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రాజెక్టు రూపకల్పన, నిర్మాణ దశలు, ఇంజినీరింగ్ విశేషాలను ప్రతిబింబించే చిత్రాలను ఆయన ఆసక్తిగా వీక్షించారు. నగర అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న మౌలిక వసతుల ప్రాజెక్టుల పురోగతిపై కూడా అధికారులతో చర్చించారు. అనంతరం ముఖ్యమంత్రి ఓపెన్‌టాప్ జీప్‌లో ఫ్లైఓవర్‌పై ప్రయాణిస్తూ నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనతో కలిసి ప్రయాణించి ప్రాజెక్టు ప్రత్యేకతలను వివరించారు. ఫ్లైఓవర్ ద్వారా నగరంలోని పలు ప్రాంతాల మధ్య అనుసంధానం మెరుగుపడటంతో పాటు వాహనదారులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది.

ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్, పార్లమెంట్ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, వేమ్ నరేందర్ రెడ్డి, అసదుద్దీన్ ఒవైసీ, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే బలాలా అహ్మద్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు కూడా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చంచల్‌గూడ – సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభంతో హైదరాబాద్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత మరోసారి స్పష్టమైంది. నగర ట్రాఫిక్ సమస్యల పరిష్కారంతో పాటు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న ప్రాజెక్టులు హైదరాబాద్‌ను మరింత ఆధునిక నగరంగా తీర్చిదిద్దనున్నాయని ప్రభుత్వం పేర్కొంది.

# డ్రగ్స్ వినియోగదారులపై పోలీసుల ఉక్కుపాదం

**హైదరాబాద్, సెప్టెంబర్ 3, (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ నగరంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు మరింత కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇకపై నేర స్వభావంతో సంబంధం లేకుండా అనుమానితులకు డ్రగ్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. పరీక్షల్లో మాదకద్రవ్యాల వినియోగం నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై ఎన్డీపీఎస్ చట్టం కింద అదనపు కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. దీంతో డ్రగ్స్ వినియోగదారులపై నిఘా మరింత కఠినతరం కానుంది. గతంలో రోడ్డు ప్రమాదాలు, దాడులు, గొడవలు లేదా అనుమానాస్పద ప్రవర్తన కనిపించిన సందర్భాల్లో మాత్రమే డ్రగ్ పరీక్షలు నిర్వహించేవారు. అయితే మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పుడు మరింత విస్తృతంగా పరీక్షలు చేపట్టాలని నిర్ణయించారు. ఇటీవల మాదాపూర్‌లోని ఇన్‌ఆర్బిట్



మాల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువతి మృతి చెందిన ఘటనలో డ్రైవర్‌కు మద్యం పరీక్షతో పాటు డ్రగ్ స్క్రీనింగ్ కూడా నిర్వహించారు. అలాగే తుక్కుగూడలో నర్సుపై జరిగిన అత్యాచారం, హత్య కేసులోనూ నిందితుడికి డ్రగ్ పరీక్ష నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

ఎన్డీపీఎస్ కేసుల్లో చిక్కుకున్న వ్యక్తుల పేర్లను సస్పెక్ట్ షీట్‌లో నమోదు చేయడం ద్వారా వారిపై ప్రత్యేక నిఘా ఉంచేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. తద్వారా వారు మళ్లీ మాదకద్రవ్యాల వినియోగానికి పాల్పడకుండా నియంత్రించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ పోలీస్ శాఖ రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లకు ఆధునిక డ్రగ్ టెస్టింగ్ కిట్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ డ్రగ్ టెస్టింగ్ కిట్‌ల ప్రత్యేకత ఏమిటంటే మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన ఆనవాళ్లను 90 రోజుల వరకు గుర్తించగలగడం. దీంతో ఇతర రాష్ట్రాలు లేదా విదేశాల్లో డ్రగ్స్ తీసుకున్న వ్యక్తులను కూడా గుర్తించే అవకాశం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగంపై సమర్థవంతమైన నియంత్రణ కోసం ఈ సాంకేతికత ఉపయోగపడనుంది.

మాదకద్రవ్యాల కేసులు ప్రతి ఏడాది పెరుగుతున్నాయనే గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2024లో ఎన్డీపీఎస్ కేసుల్లో 954 మందిని అదుపులోకి తీసుకోగా, 2025లో ఆ సంఖ్య 1,228కు పెరిగింది. మరోవైపు గత మూడేళ్లలో రాష్ట్రంలో సుమారు 800 మంది విద్యార్థులు కొత్తగా మాదకద్రవ్యాలకు బానిసలైనట్లు అధ్యయనాలు వెల్లడించాయి. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లోనూ గణనీయ సంఖ్యలో వ్యక్తులకు డ్రగ్ పరీక్షల్లో పాజిటివ్ ఫలితాలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అత్యాధునిక డ్రగ్ టెస్టింగ్ కిట్‌లు అరచేతిలో ఇమిడిపోయేంత చిన్నవిగా ఉండటంతో వీటిని ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లవచ్చు. లాలాజలం లేదా మూత్ర నమూనాల ఆధారంగా కేవలం రెండు నిమిషాల్లోనే ఫలితాలు వెల్లడవుతాయి. ఒకేసారి 11 రకాల మాదకద్రవ్యాలను గుర్తించే సామర్థ్యం ఈ కిట్‌లకు ఉండటం విశేషం. మాదకద్రవ్యాల వినియోగాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా పోలీసులు చేపడుతున్న ఈ చర్యలు నగరంలో డ్రగ్స్ నియంత్రణకు కీలకంగా మారనున్నాయి.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై హరీశ్‌రావు ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని బాండ్ పేపర్లపై హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు వెయ్యి రోజులు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. రూ.4 వేల పెన్షన్, రూ.15 వేల రైతుబంధు, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, విద్యార్థులకు భరోసా కార్డులు, ఆడపిల్లలకు స్కూటీలు, రెండు లక్షల ఉద్యోగాలు వంటి హామీలను ఇచ్చి ప్రజల నుంచి ఓట్లు పొందారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వారం రోజుల పాటు బీఆర్ఎస్ చేపడుతున్న నిరసనల ప్రధాన లక్ష్యం కాంగ్రెస్‌ను హామీల అమలుకు ఒత్తిడి చేయడమేనని స్పష్టం చేశారు.

రైతుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. కేసీఆర్ పాలనలో రైతుబీమా ద్వారా రైతు మరణిస్తే వారం రోజుల్లో రూ.5 లక్షల పరిహారం అందేదని, కానీ ప్రస్తుతం ప్రభుత్వం ప్రీమియం చెల్లించకపోవడంతో రైతుబీమా నిలిచిపోయిందని అన్నారు. రైతుబంధు కింద ఇవ్వాల్సిన వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం నిలిపివేసిందని, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని మండిపడ్డారు. విద్యుత్ సరఫరా, ఎరువుల లభ్యత, పంటల కొనుగోలు వంటి అంశాల్లో కూడా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో మెదక్ జిల్లాపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో చేపట్టిన కాళేశ్వరం, మల్లన్న సాగర్, రంగనాయకసాగర్ వంటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్ల సాగునీటి పరిస్థితి దెబ్బతిన్నదన్నారు. బసవేశ్వర, సంగమేశ్వర, ఘనపూర్ ఆనకట్ట, నర్సాపూర్‌మెదక్ కాలువ వంటి కీలక ప్రాజెక్టుల పనులు నిలిచిపోయాయని, వాటి పూర్తి ద్వారా వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశాన్ని ప్రభుత్వం కోల్పోయిందని ఆరోపించారు.

రుణమాఫీ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ సవాల్ విసిరిన హరీశ్‌రావు, కౌడిపల్లి మండలంలో అందరికీ రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే తాను రాజీనామా చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. అదే రుణమాఫీ జరగలేదని తేలితే ముఖ్యమంత్రి రాజీనామా చేస్తారా అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేశారని, విద్యార్థులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బందిపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. 22ఎ నిషేధిత జాబితాలో రైతుల భూములను చేర్చడం వల్ల భూయజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. కౌడిపల్లి, మహమ్మద్‌నగర్ పీఏసీఎస్‌లలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవినీతి వ్యవహారాలపై తక్షణ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఎస్పీలను కోరారు. రైతుల భూములను నిషేధిత జాబితాలో పెట్టిన కాంగ్రెస్ పార్టీని రానున్న ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించడం ఖాయమని, తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని హరీశ్‌రావు అన్నారు.

# ఉచిత పోలీసు కోచింగ్ శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి పొంగులేటి

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన ఉచిత పోలీసు కానిస్టేబుల్, ఎస్సై కోచింగ్ శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత భవిష్యత్తు కోసం నాణ్యమైన శిక్షణ అందించడం ఎంతో అవసరమన్నారు. గతంలో 2016లో ఇదే తరహాలో 2,300 మందికి శిక్షణ అందించగా, వారిలో 350 మందికి పైగా ఉద్యోగాలు సాధించారని గుర్తు చేశారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల కుటుంబాల్లో కనిపించిన ఆనందాన్ని తాను ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. ఈసారి కూడా శిక్షణ పొందుతున్న అభ్యర్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువతకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఉత్తమ అధ్యాపకులు, నాణ్యమైన అధ్యయన సామగ్రి, ప్రత్యేక రీజనింగ్ పుస్తకాలతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి అభ్యర్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. నిరుద్యోగ అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మధ్యాహ్న భోజన వసతిని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఆర్థిక సమస్యలు శిక్షణకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. శిక్షణ పొందే ప్రతి ఒక్కరు పూర్తి ఏకాగ్రతతో లక్ష్యసాధన కోసం కృషి చేయాలని కోరారు.

రైట్ ఛాయిస్ నిర్వాహకుడు మెండెం కిరణ్ కుమార్ సేవలను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. యువతకు సరైన మార్గదర్శకత్వం అందిస్తూ ఉద్యోగ అవకాశాల వైపు నడిపిస్తున్న ఆయన కృషి ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా కోచింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాలను మంత్రి ఆవిష్కరించి అభ్యర్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వి. సీతారాములు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొర్రా రాజశేఖర్, అదనపు డీసీపీ రామానుజం, ఐఏఎస్ శిక్షకుడు ఆకెళ్ల రాఘవేంద్రరావు, రీజనింగ్ అధ్యాపకుడు రమణ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థులకు అధ్యయన సామగ్రిని పంపిణీ చేశారు. ఉద్యోగాల కోసం కృషి చేస్తున్న యువతకు అవసరమైన మార్గదర్శకత్వం, శిక్షణ అందించడం ద్వారా వారి లక్ష్య సాధనకు ప్రభుత్వం తోడ్పడుతోందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఉద్యోగ ప్రకటన వెలువడిన వెంటనే జిల్లా ఎస్పీతో చర్చించి ఉచిత శిక్షణ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లలో సహకరించిన జిల్లా కలెక్టర్‌ను అభినందించారు. టాస్క్ సహకారంతో ఉచిత శిక్షణ అందించేందుకు ముందుకొచ్చిన శిక్షణ సంస్థ నిర్వాహకులను కూడా ప్రశంసించారు. యువత ఉద్యోగ సాధనలో ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా చూడటమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు.

పోలీస్ ఉద్యోగాల ఎంపికలో శారీరక ప్రమాణాలు కీలకమని పేర్కొన్న మంత్రి, అభ్యర్థులు చివరి దశలో నిరాశ చెందకుండా ముందుగానే ప్రాథమిక శారీరక కొలతలను పరిశీలించినట్లు తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రక్రియలో అర్హత సాధించిన 250 మంది అభ్యర్థులను శిక్షణకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. శిక్షణ పొందుతున్న ప్రతి ఒక్కరూ పట్టుదలతో కృషి చేసి ఉద్యోగాలను సాధించాలని ఆకాంక్షించారు. ములుగు నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల యువతకు కూడా ఇలాంటి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా గంగారం, కొత్తగూడ మండలాల యువత కోసం కూడా శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమైనట్లు చెప్పారు. భూపాలపల్లి జిల్లాలోని నియోజకవర్గ పరిధి గ్రామాల యువతకు కూడా ఇదే తరహా శిక్షణ అందించేందుకు సంబంధిత అధికారులతో చర్చించినట్లు వెల్లడించారు. గతంలో ఉద్యోగ మేళాలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుతం వచ్చిన ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విజయం సాధించే వరకు ప్రయత్నం కొనసాగించాలని మంత్రి సీతక్క యువతకు సూచించారు. రాత పరీక్షల్లో గానీ, శారీరక సామర్థ్య పరీక్షల్లో గానీ ఆశించిన ఫలితం రాకపోతే నిరుత్సాహపడకుండా మళ్లీ ప్రయత్నించాలని చెప్పారు. కుటుంబ బాధ్యతలతో పాటు చదువుకు, శారీరక సాధనకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పోషకాహారం తీసుకుంటూ క్రమశిక్షణతో సాధన చేస్తే లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం కష్టపడి ఉద్యోగం సాధిస్తే భవిష్యత్తులో కుటుంబానికి అండగా నిలవగలరని అభ్యర్థులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, సీఐలు, పోలీస్ సిబ్బంది, అభ్యర్థులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొని శిక్షణ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ అడ్మిషన్లు

- **సెప్టెంబర్ 9వరకు దరఖాస్తులకు గడువు పెంపు**

**మహబూబ్ నగర్ బ్యూరో సెప్టెంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు)** :డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2026 2027 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ బి.ఏ, బి.కామ్, బి.యస్సీ., కోర్సులో ప్రవేశాలకు సెప్టెంబర్ 09,2026 వరకు దరఖాస్తులు స్వీకరింస్తున్నటు ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాజేంద్ర ప్రసాద్, కోఆర్డినేటర్ డాక్టర్ సి.హెచ్.కిషోర్ కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కోర్సులో బి.ఏ, బి.కామ్, బి.స్సీ., తెలుగు,ఇంగ్లీష్,ఉర్దూ మీడియంలో చేరడానికి అవకాశమని తెలిపారు.ఇంటర్, ఓపెన్ ఇంటర్,రెండు సంవత్సరాల ఐ.టీ.ఐ, డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు సెప్టెంబర్ 9వ తేదీలోపు ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉద్యోగులు, గృహిణులు, చదువు మధ్యలో నిలిపివేసినవారు, ఉన్నత విద్యను కొనసాగించాలనుకునేవారికి ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ చదివే మంచి అవకాశం కలిపించ బడిందన్నారు. అలాగే డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరాలలో చదువుతున్న విద్యార్థులు తమ కోర్సు ఫీజులను సెప్టెంబర్ 9,2026 తేదీలోపు ఆన్లైన్లో చెల్లించాలని సూచించారు. అడ్మిషన్లు, ఫీజులు తదితర వివరాలకు 7382929757 ను సంప్రదించాలని తెలిపారు.

# రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలిగా గద్వాల విజయలక్ష్మి

- **క్యాబినెట్ హోదాతో కీలక నియామకం**
- **చిన్నారెడ్డి స్థానంలో బాధ్యతలు**
- **మహిళా కమిషన్ పదవికి రాజీనామా**
- **నెరెళ్ల శారదకు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ బాధ్యతలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలిగా గద్వాల విజయలక్ష్మిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ పదవికి క్యాబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహించిన చిన్నారెడ్డిని పదవి నుంచి తప్పించి ఆయన స్థానంలో గద్వాల విజయలక్ష్మిని నియమించారు.

రాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయంతో గద్వాల విజయలక్ష్మికి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలి బాధ్యతలు అప్పగించబడ్డాయి. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, అమలు అంశాల్లో ఈ పదవికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలిగా నియమితులైన నేపథ్యంలో గద్వాల విజయలక్ష్మి తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశారు. కొత్త బాధ్యతల దృష్ట్యా ఆమె తన పదవిని వీడినట్లు అధికార వర్గాలు తెలిపాయి. గద్వాల విజయలక్ష్మి రాజీనామాతో ఖాళీ అయిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికి రాష్ట్ర ప్రభుత్వం నెరెళ్ల శారదను నియమించింది. మహిళల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణలో మహిళా కమిషన్ కీలక పాత్ర పోషిస్తుండగా, కొత్త నియామకంతో ఆ బాధ్యతలను నెరెళ్ల శారద చేపట్టనున్నారు. రాష్ట్రంలోని కీలక పదవుల్లో జరిగిన ఈ మార్పులు తెలంగాణ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రభుత్వం చేపట్టిన ఈ నియామకాలపై వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు స్పందిస్తున్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ | తెలుగు దిన పత్రిక
శుక్రవారం - 04 - సెప్టెంబర్ - 2026


# చిన్నారులకు కలుషిత ఆహారం..?




- కిష్టారం అంగన్వాడీలో ఘటన.
- ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స.

**సత్తుపల్లి, సెప్టెంబర్ 3(తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందించిన ఆహారంపై కలకలం రేగింది. పప్పు కూరలో గన్నేరు ఆకులు పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆహారం తిన్న ముగ్గురు చిన్నారులు అస్వస్థతకు గురైనట్లు సమాచారం. స్థానికులు, తల్లిదండ్రుల వివరాల ప్రకారం.. మూడు రోజుల క్రితం అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు పప్పు కూర వడ్డించారు. ఆహారం తీసుకున్న అనంతరం ముగ్గురు చిన్నారుల్లో అనారోగ్య లక్షణాలు కనిపించడంతో తల్లిదండ్రులు వారిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. తొలుత సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. అక్కడ చికిత్స పొందిన అనంతరం ప్రస్తుతం ముగ్గురు చిన్నారులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటన జరిగిన విషయం మూడు రోజుల తర్వాత వెలుగులోకి రావడంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంగన్వాడీ కేంద్రంలో ఆహారం తయారీ, వడ్డింపు సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించలేదా? పప్పు కూరలో గన్నేరు ఆకులు పడినట్లు అనుమానం ఉంటే వాటిని ఎందుకు గుర్తించలేకపోయారనే ప్రశ్నలు తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. ఘటనపై సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం ఇచ్చారా? లేదా? అనే అంశంపైనా స్పష్టత రావాల్సి ఉంది. ముగ్గురు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఘటనపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, అంగన్వాడీ కేంద్రంలో ఆహార నాణ్యతను పరిశీలించి, నిర్లక్ష్యానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కల్లూరులో బీఆర్ఎస్ రైతు గర్జన



- 400 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ.
- రైతు సమస్యలపై సండ్ర వెంకటవీరయ్య సమరశంఖం.

**సత్తుపల్లి, సెప్టెంబర్ 3(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో రైతులకు చేసిందేమీ లేదని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కల్లూరులో భారీ రైతు ర్యాలీ నిర్వహించారు. చెన్నూరు నుంచి కల్లూరు సెంటర్ వరకు సుమారు 400 ట్రాక్టర్లతో సాగిన ర్యాలీలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా తల్లాడ, కల్లూరు ప్రాంత రైతులకు గోదావరి జలాలను పూర్తిస్థాయిలో అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే అవసరమైతే ఇరిగేషన్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. యూరియా కోసం రైతులు రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని సండ్ర ఆరోపించారు. చివరకు యూరియా కోసం చెప్పులు, ఆధార్ కార్డులు క్యూలో పెట్టుకునే దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. యూరియా పంపిణీకి యాప్ విధానం తీసుకురావడంతో రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందుబాటులో ఉంచడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతుబంధు, రైతుబీమా, సీతారామ ప్రాజెక్టు వంటి కార్యక్రమాలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనమని సండ్ర పేర్కొన్నారు. కల్లూరు ప్రాంత రైతాంగానికి సాగునీరు అందేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికలు, కృషి ఫలితంగానే ఈ ప్రాంతానికి ప్రయోజనం కలుగుతోందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో 100 రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలు 1000 రోజులు పూర్తయినా ఎందుకు అమలు చేయలేదని సండ్ర ప్రశ్నించారు. రైతులు, మహిళలు, ఉద్యోగులు, పేదలు సహా అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనపై అసంతృప్తితో ఉన్నారని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రజలు, రైతుల సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు గోదావరి జలాల కోసం అవసరమైతే ఇరిగేషన్ కార్యాలయాలను ముట్టడించి రైతుల తరఫున పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సండ్ర వెంకటవీరయ్య స్పష్టం చేశారు.

# భవన నిర్మాణ, హమాలి కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఆర్టీయూ ధర్నా

- సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- పెన్షన్ మంజూరు చేసి ఇళ్ల స్థలాలు కేటాయించాలి

**కరీంనగర్, సెప్టెంబర్ 3(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బీఆర్ఎస్ అనుబంధ బీఆర్టీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ, హమాలి కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 35 మంది కార్మికులు పాల్గొన్నారు.
కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెన్షన్ మంజూరు చేయాలని, ఇందిరమ్మ కాలనీలు ఏర్పాటు చేసి ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.



# అక్రమ బెల్ట్ షాపులను తక్షణమే తొలగించి, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**తెలంగాణ గౌడ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,జాక్ చైర్మన్ గట్టు నరేష్ గౌడ్**




**హసన్ పర్తి సెప్టెంబర్ 03(తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ జిల్లాలో ప్రొహిబిషన్ & ఎక్సైజ్ చట్ట నిబంధనలకు విరుద్ధంగా జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న అక్రమ మద్యం విక్రయ కేంద్రాలు, బెల్ట్ షాపులను తక్షణమే గుర్తించి పూర్తిస్థాయిలో తొలగించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గౌడ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాక్ చైర్మన్ గట్టు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ గారికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా గట్టు నరేష్‌గౌడ్ మాట్లాడుతూ వరంగల్ జిల్లాలోని అనేక గ్రామాలు,మండలాలు, పట్టణ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా యువత అక్రమ మద్యం విక్రయ కేంద్రాలకు ఆకర్షితులై మద్యానికి బానిసలుగా మారుతున్న పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అక్రమ బెల్ట్ షాపుల వల్ల గీత కార్మికులకు కూడా తీవ్ర నష్టం జరుగుతోందని గట్టు నరేష్ గౌడ్ అన్నారు. గీత కార్మికులు సంప్రదాయ వృత్తిలో భాగంగా కల్లు ఉత్పత్తి చేసి తమ జీవనోపాధిని కొనసాగిస్తుండగా అక్రమంగా మద్యం విక్రయించే బెల్ట్ షాపుల కారణంగా గీత కార్మికుల వృత్తి,ఆదాయంపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.
అంతేకాకుండా,కొన్ని గ్రామాల్లో బెల్ట్ షాప్ నిర్వాహకులు గీత కార్మికులను బెదిరించడం,దురుసుగా ప్రవర్తించడం,భౌతిక దాడులకు పాల్పడుతున్న ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఇలాంటి ఘటనలను ఏమాత్రం సహించేది లేదని,గీత కార్మికులపై దాడులకు పాల్పడే వారిపై పోలీసులు,ఎక్సైజ్ అధికారులు వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గీత కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా అక్రమ మద్యం విక్రయాలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం సరికాదని అన్నారు.బెల్ట్ షాపుల వల్ల గీత కార్మికులకు జరుగుతున్న నష్టాన్ని ప్రభుత్వం,ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.
జిల్లాలోని ప్రతి గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను గుర్తించి, వాటిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి,నిబంధనలను ఉల్లంఘిస్తున్న నిర్వాహకులపై చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని కోరారు. కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే కాకుండా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ మద్యం విక్రయాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యం,యువత భవిష్యత్తు,కుటుంబాల సంక్షేమంతో పాటు గీత కార్మికుల జీవనోపాధిని కాపాడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందని గట్టు నరేష్‌గౌడ్ పేర్కొన్నారు.గీత కార్మికులపై ఎవరైనా దాడులకు పాల్పడితే,వారిపై వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అక్రమ మద్యం విక్రయాలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే తెలంగాణ గౌడ యువజన సంఘం ప్రజల పక్షాన,గీత కార్మికుల పక్షాన మరింత బలంగా పోరాటం చేస్తుందని గట్టు నరేష్ గౌడ్ స్పష్టం చేశారు.“అక్రమ బెల్ట్ షాపులను తొలగించాలి – గీత కార్మికుల జీవనోపాధిని కాపాడాలి – గీత కార్మికులపై దాడులను అరికట్టాలి” అనే డిమాండ్లతో పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ యువజన సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు కత్తి చిరంజీవి గౌడ్,గౌడ సంఘం రాష్ట్ర నాయకులు బండారి జనార్ధన్ గౌడ్,కత్తి వర్షిత్ గౌడ్, కళ్లెపు రఘు గౌడ్ తదితర గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# రైతు వ్యతిరేక కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ పోరుబాట



- రేకుర్తిలో గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో భారీ నిరసన

**కరీంనగర్, సెప్టెంబర్ 3(తెలంగాణ ముచ్చట్లు ):** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోయిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్ నగరంలోని రేకుర్తిలో భారీ నిరసన చేపట్టారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
రుణమాఫీ, రైతుబంధు అమలులో జాప్యం, రైతుబీమా, ధాన్యం బోనస్, యూరియా, సాగునీటి సమస్యలపై ప్రభుత్వ తీరును నిరసిస్తూ నాయకులు ఆందోళన చేపట్టారు. అలాగే 22ఏ నిషేధిత భూముల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

# సీడీసీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డిని పరామర్శించిన రాష్ట్రమంత్రి పొంగులేటి



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 3(తెలంగాణ ముచ్చట్లు):** ఇటీవల శాస్త్ర చికిత్స జరిగి, విశ్రాంతి తీసుకుంటున్న ఈశ్వర మాదారం గ్రామానికి చెందిన సిడిసి చైర్మన్ యరబోలు సూర్య నారాయణ రెడ్డిని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని.. తమ్ముడూ ధైర్యంగా ఉండు అంటూ సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి. హాఫీజుద్దీన్, నాయకులు జూకూరి గోపాలరావు, పలువురు సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వెయ్యోంతుల... జోష్

- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన వెయ్యి రోజుల పూర్తి సందర్భంగా....కూసుమంచిలో 1,000 బైకులతో భారీ ర్యాలీ
- ఓపెన్ టాప్ జీప్ లో ముందుకు సాగి.. మరింత ఉత్సాహం నింపిన రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి
- బీఆర్ఎస్ తీరుపై భగ్గు..
- అసలు దొరే ఫాం హౌస్ కు పరిమితమయ్యాడని.. పిల్ల కాకులు కారు కూతలు మానుకోవాలని ఎద్దేవా
- పాలేరులో మళ్లీ గెలిచేది.. నిలిచేది కాంగ్రెస్సేనన్న శీనన్న




**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 3(తెలంగాణ ముచ్చట్లు ):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా.. కాంగ్రెస్ ఆధ్వర్యంలో 1,000 బైకులతో నాయకన్ గూడెం నుంచి కూసుమంచి వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఓపెన్ టాప్ జీపులో ముందుకు సాగుతూ.. పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా కూసుమంచి ప్రధాన సెంటర్లో కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు.

**3,475 రోజుల మీ పాలనలో చేసిందేమీ లేదు...పిల్ల కాకులు కారు కూతలు మానుకోవాలంటూ హెచ్చరిక**

ప్రజలు బీఆర్ఎస్ దొరను ఫామ్ హౌస్ కే పరిమితం చేశారనే అక్కసుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజాపాలనపై బీఆర్ఎస్ నేతలు విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 3,475 రోజుల వారి పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. పేదలకు ఇందిరమ్మ ఇళ్లిచ్చామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లకు ఉచిత విద్యుత్, నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇలా ఎన్నో చేసామని వివరించారు. నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా...తమ పాలనలో చూపామని అన్నారు.
అసలు పెద్ద దొరనే ఫామ్ హౌస్ కు పరిమితం అయ్యాడని, పిల్ల కాకులు కారు కూతలు మానుకోవాలని హితవు పలికారు. అభివృద్ధి, సంక్షేమాన్ని పేదల గడపకు చేర్చాం..
ప్రజల దీవెనలతో తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చి..సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం పేదల ఇంటి గడపలకు చేర్చి వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన రంగాలను ఒక్కొక్కటిగా సరిదిద్దుతున్నామని, రైతులు, మహిళలు, నిరుద్యోగులు, దళిత, బీసీ, మైనారిటీలకు ప్రభుత్వ లబ్ధి కలిగేలా కృషి చేస్తున్నామని చెప్పారు.

**పాలేరులో మళ్ళీ గెలిచేది... నిలిచేది కాంగ్రెస్సే**

పాలేరు నియోజకవర్గానికి.. రూ.కోట్లాది నిధులతో ఎంతో చేశామని, భవిష్యత్ లో ఇంకెంతో చేస్తానని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ పాలనలో పాలేరు రిజర్వాయర్ ను తీవ్ర నిర్లక్ష్యం చేశారని, ఇక్కడి రైతులను విస్మరించి మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు నీటిని తరలించారని.. ఇప్పుడు గుడ్డు వచ్చి పిల్లని వెక్కిరించినట్లుగా.. మాట్లాడడానికి సిగ్గుండాలని తీవ్రంగా హెచ్చరించారు. పాలేరు అంటేనే కాంగ్రెస్ అని, పాలేరు నియోజకవర్గం అంటే తనకు సొంతిల్లు అని, ఎవరెన్ని పొర్లుదండాలు పెట్టినా.. మళ్ళీ ఇక్కడ గెలిచేది, నిలిచేది ముమ్మాటికీ కాంగ్రెస్సే అని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో..: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి హఫీజ్ ఉద్దీన్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, జూకూరి గోపాలరావు, కూసుమంచి సర్పంచ్ కొండా కృష్ణవేణి, పాలేరు సర్పంచ్ బానోత్ నాగేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## వినాయక చవితి ఏర్పాట్లలో జాప్యం ఎందుకు?




- **పండుగకు ముందే 66 డివిజన్లలో పనులు పూర్తి చేయాలి: గుంజపడుగు హరిప్రసాద్**

**కరీంనగర్, సెప్టెంబర్ 3(తెలంగాణ ముచ్చట్లు ):**వినాయక చవితి పండుగకు ముందస్తు ఏర్పాట్లలో కరీంనగర్ నగర పాలక సంస్థ పాలకవర్గం విఫలమైందని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండుగకు సమయం దగ్గరపడుతున్నా నగరంలోని 66 డివిజన్లలో అవసరమైన పనులు ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడం ఆందోళనకరమన్నారు.

ప్రతి డివిజన్‌లో దుమ్ము నివారణ, సిమెంట్ ప్యాచ్‌వర్క్ తదితర పనులకు సుమారు రూ.లక్ష చొప్పున టెండర్లు పిలిచినా, ఒప్పందాలు, పరిపాలనా అనుమతుల పేరుతో మరింత జాప్యం జరిగే అవకాశం ఉందన్నారు. పనులు ప్రారంభించేలోపే పండుగ ముగిసే పరిస్థితి ఏర్పడకూడదని అన్నారు. వినాయక చవితి ఏర్పాట్లను గణేష్ మండపాల నిర్వాహకులు, స్థానిక యువత, ప్రజలు కూడా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని కోరారు. ప్రతి డివిజన్‌లో పనుల అంచనా వ్యయం, కాంట్రాక్టర్ వివరాలు, పనుల పరిమాణం, నాణ్యతపై నగరపాలక సంస్థ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ప్రజాధనంతో చేపడుతున్న పనుల్లో నాణ్యత లోపిస్తే దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పండుగకు ముందే యుద్ధప్రాతిపదికన నాణ్యతతో కూడిన పనులు పూర్తి చేసి నగర ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో లింగంపల్లి నాగరాజు, అంకం శివరాణి, మ్యాకల తిరుపతి, రంగరవేణి లక్ష్మణ్, కుతాడి శ్రీనివాస్, శ్రీరాముల రమేష్, బసవేణి రాజేందర్, మడిపల్లి వినిత్, బండారి అభిరాం, జంగ అపర్ణ, అసియా సుల్తానా, పల్లె శారద తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేత జక్కుల కిరణ్‌కుమార్‌పై అత్యాచారం, ఎస్సీ–ఎస్టీ అట్రాసిటీ కేసు

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ నాయకుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే అనుచరుడిగా పేర్కొంటున్న జక్కుల కిరణ్‌కుమార్‌పై నేరేడ్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్యాచారం, దాడి, బెదిరింపులతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



ఫిర్యాదు ప్రకారం.. కిరణ్‌కుమార్ తనకు ఇప్పటికే వివాహం జరిగిన విషయాన్ని దాచిపెట్టి తనతో సన్నిహితంగా మెలిగాడని బాధితురాలు ఆరోపించారు. వ్యాపార భాగస్వామ్యం కోసం తాను సుమారు రూ.30 లక్షలు సమకూర్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అనంతరం తనపై, తన 10 ఏళ్ల కుమారుడిపై దాడి చేశారని, కులం పేరుతో దూషించి అవమానించారని మహిళ ఆరోపించారు. తన ఫొటోలను మార్ఫింగ్ చేసి పరువు తీసేందుకు ప్రయత్నించారని, హైదరాబాద్ విడిచి వెళ్లకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

తనను హత్య చేసేందుకు రూ.10 లక్షలు ఖర్చు చేయడానికైనా సిద్ధమని కిరణ్‌కుమార్ బెదిరించినట్లు మహిళ ఆరోపించారు.

ఈ ఫిర్యాదు ఆధారంగా నేరేడ్‌మెట్ పోలీసులు క్రైమ్ నంబర్ 751/2026 నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. BNS సెక్షన్లు 69, 74, 79, 115(2), 351(2)తో పాటు ఎస్ సి/ఎస్ టీ (పి ఓ ఏ) యాక్ట్ 2015 సెక్షన్ 3(2)(వి) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## జమ్మికుంట పత్తి మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

- **శ్రీకృష్ణాష్టమి సందర్భంగా సెప్టెంబర్ 4 నుంచి 6 వరకు మార్కెట్‌యార్డు మూసివేత**

**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** శ్రీకృష్ణాష్టమి (జన్మాష్టమి) పండుగ సందర్భంగా జమ్మికుంట పత్తి మార్కెట్‌యార్డుకు మూడు రోజుల పాటు సెలవు ప్రకటించారు. ఈ మేరకు మార్కెట్ ఛైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం తెలిపారు.



సెప్టెంబర్ 4 శుక్రవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా, సెప్టెంబర్ 5 శనివారం మార్కెట్‌కు సెలవు ఉండనుంది. సెప్టెంబర్ 6 ఆదివారం సాధారణ సెలవు కావడంతో వరుసగా మూడు రోజుల పాటు మార్కెట్‌యార్డు కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి.

సెప్టెంబర్ 7 సోమవారం నుంచి మార్కెట్‌యార్డు యథావిధిగా ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు. రైతు సోదరులు ఈ సెలవు రోజులను గమనించి తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌యార్డుకు తరలించవద్దని సూచించారు.

# పట్టుదలతో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు

- **భవిష్యత్తులో ఉద్యోగులుగా, అధికారులుగా స్థిరపడాలన్నదే నా ఆకాంక్ష**
- **పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్- రైట్ ఛాయిస్ ఆధ్వర్యంలో ఫ్రీ పోలీస్ కోచింగ్ క్యాంప్ ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి**
- **నిరుద్యోగ అభ్యర్థులకు మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పిస్తానని అభయం**





**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 3(తెలంగాణ ముచ్చట్లు):** పట్టుదలతో ప్రయత్నిస్తే, ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగితే.. నేటి నిరుద్యోగ యువతీ, యువకులు భవిష్యత్తులో ఉద్యోగులుగా, అధికారులుగా స్థిరపడొచ్చని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. పొంగులేటి స్వరాజ్యం రాఘవరెడ్డి ( పీఎస్ఆర్) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రైట్ ఛాయిస్ నిర్వహణలో నగరంలోని బైపాస్ రోడ్డు లో గల రామకృష్ణ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఫ్రీ కోచింగ్ క్యాంప్ ను గురువారం ప్రారంభించారు. కలెక్టర్ దివాకర, తదితర ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రసంగిస్తూ.. గతంలో 2016లో 2,300 మందికి ఇలానే శిక్షణ ఇప్పించగా.. 350 మందికి పైగా ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని, ఆరోజు..వారి తల్లిదండ్రుల కళ్లలో చూసిన ఆనంద భాష్పాలు తానెప్పటికీ మరువలేనని అన్నారు.

మీ శీనన్నగా.. అండగా ఉంటా

మధ్యతరగతి యువతీ యువకుల ఉన్నత భవిష్యత్తు కోసం తన వంతుగా సహకారం అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని అన్నారు. ఉత్తమ ఫ్యాకల్టీతో, రీజనింగ్ పుస్తకాలతో ఏర్పాటు చేసిన ఈ ఫ్రీ కోచింగ్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగ అభ్యర్థులెవరికీ ఇబ్బంది కలగకుండా.. మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పిస్తున్నట్లు ప్రకటించారు. రైట్ చాయిస్ నిర్వాహకులు.. మెండెం కిరణ్ కుమార్ కృషి, తనతో ఉన్న అనుబంధం మరువలేనిదని మంత్రి పొంగులేటి గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కోచింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో..: మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వి. సీతారాములు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొర్రా రాజశేఖర్, అడిషనల్ డీసీపీ రామానుజం, ఐఏఎస్ ట్రైనర్ ఆకెళ్ళ రాఘవేంద్రరావు, రీజనింగ్ ఫ్యాకల్టీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన..

- **భీమదేవరపల్లిలో నాయకులు, కార్యకర్తల భారీ సమీకరణ**
- **ఘనంగా ర్యాలీ, సమావేశం**





**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 03(తెలంగాణ ముచ్చట్లు);** భీమదేవరపల్లీ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ శాఖ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ అనంతరం జరిగిన సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు ప్రజలకు వివరించారు.

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, అర్హులైన కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్,గృహజ్యోతి పథకం ద్వారా నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు.అలాగే రైతు భరోసా ద్వారా రైతులకు పెట్టుబడి సహాయం, సన్న రకం ధాన్యానికి బోనస్, రైతు రుణమాఫీ, ఉచిత వ్యవసాయ విద్యుత్, పంట నష్టపరిహారం వంటి చర్యలతో రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. 2026లో రైతు భరోసా కింద 73.30 లక్షల మంది రైతుల ఖాతాలకు రూ.9,000 కోట్లు జమ చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

ఇందిరమ్మ ఇండ్లు ద్వారా పేదలకు సొంతింటి కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, చేయూత-రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.10 లక్షల వరకు వైద్య భద్రత కల్పిస్తున్నామని తెలిపారు.

అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, మహిళా సంఘాలకు రుణాలు, మహిళా శక్తి కార్యక్రమాలు, యువతకు ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని నాయకులు పేర్కొన్నారు.

పదేళ్ల పాలనలో ఏం చేశారు?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చినా, వాటిలో అనేక హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. పేదలకు ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, రైతులకు పూర్తి స్థాయి రుణమాఫీ వంటి అంశాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు.

హామీలు చెప్పడం కాదు.. హామీలను అమలు చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రత్యేకత అని నాయకులు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు వంటి హామీలను అమలు చేసి ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు.

భీమదేవరపల్లీ మండల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి, వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి , రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్, TPCC అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ కి కాంగ్రెస్ పార్టీ తరపున, భీమదేవరపల్లీ మండల ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ పాలనను ప్రతి గ్రామంలోని ప్రతి కుటుంబానికి చేరేలా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకుడికి, కార్యకర్తకు భీమదేవరపల్లీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు పోచంపల్లి రాజిరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు ఘనంగా బైక్ ర్యాలీ

- **జమ్మికుంట మండలంలో 150 బైక్లతో కాంగ్రెస్ శ్రేణుల ప్రదర్శన..**
- **బీఆర్ఎస్‌పై పరశురాం రావు ధ్వజం**



**జమ్మికుంట, సెప్టెంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరమనేని పరశురాం రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ముందుగా కోరపల్లి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుమారు 150 బైక్లతో భారీ ర్యాలీగా బయలుదేరి జమ్మికుంట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు చేరుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరమనేని పరశురాం రావు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వం వెయ్యి రోజుల కాలంలో అర్హులైన ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు వంటి పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం కలుగుతోందని తెలిపారు.ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు, నిరసనల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. గతంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ హయాంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందలేదని ఆరోపించారు.ప్రజలు బీఆర్ఎస్‌ను ఇప్పటికే తిరస్కరించారని, రానున్న రోజుల్లోనూ అదే పరిస్థితి కొనసాగుతుందని పరశురాం రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దొగ్గల భాస్కర్, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రాసపల్లి సాగర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కుమార్, ఎన్ఎస్‌యూఐ నాయకులు సుధీర్, తనువుల సర్పంచ్ జెక్క కిరణ్ గౌడ్, మాచేపల్లి సర్పంచ్ పార్లపల్లి విజయ్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు గిరిజన శ్రీనివాస్ యాదవ్, మార్కెట్ డైరెక్టర్ రాజేశ్వరరావు, మండల నాయకులు, 20 గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జమ్మికుంట 11వ వార్డులో వినాయక మండపానికి స్థలం సిద్ధం

- **కౌన్సిలర్ పొనగంటి విష్ణు ప్రత్యేక చొరవ**

**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** వినాయక చవితి ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో జమ్మికుంట పట్టణంలోని 11వ వార్డు ఎస్సీ కాలనీలో గణేష్ మండపం ఏర్పాటుకు కౌన్సిలర్ పొనగంటి విష్ణు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కాలనీలో ప్రతి ఏడాది నిర్వహించే వినాయక చవితి ఉత్సవాల కోసం కేటాయించిన స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను జెసీబీ సహాయంతో తొలగించి పరిసరాలను శుభ్రపరచించారు. మండపం ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన స్థలాన్ని సిద్ధం చేయడంతో పాటు కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.

స్థానికుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని గణేష్ మండపం ఏర్పాటుకు అవసరమైన సహకారం అందిస్తామని కౌన్సిలర్ విష్ణు తెలిపారు. భక్తులు సౌకర్యవంతంగా ఉత్సవాల్లో పాల్గొనేలా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ మండప కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# కాప్రాలో అనుమతులు లేకుండా షెడ్ల నిర్మాణం?



- **టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం**

**కాప్రా, సెప్టెంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** కాప్రా పరిధిలోని ఎల్లారెడ్డిగూడలో ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు మధు అనే సూపర్వైజర్‌ను అక్కడ ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ నిర్మాణాలకు సంబంధించిన వివరాలు సేకరించేందుకు ఓ విలేకరి ఫొటోలు తీస్తుండగా, ''విలేకరులు అయితే ఏంటి?'' అంటూ ప్రశ్నిస్తూ భయభ్రాంతులకు గురిచేసే విధంగా వ్యవహరించారని ఆరోపణలు ఉన్నాయి.

ఈ అక్రమ నిర్మాణాలపై కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోవడంలో జాప్యం ఎందుకు జరుగుతోందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడేలా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయంపై సమగ్రంగా విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.
ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోకపోతే కాప్రా పరిధిలో జరుగుతున్న మరిన్ని అనధికార నిర్మాణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# కేరళ పాఠశాలలో కృష్ణయ్య సందడి.. చిన్నారుల వేషధారణతో కనువిందు




**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట కేరళ పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి జన్మాష్టమి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసి చిన్నారుల వేషధారణతో వేడుకలను సందడిగా జరిపారు. పాఠశాల చైర్మన్ కె.ఎస్. బెన్ని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రత్యేక కార్యక్రమాలు ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగాయి. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం పట్ల అవగాహన కల్పించేందుకు పాఠశాల యాజమాన్యం చేపడుతున్న కార్యక్రమాలను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. పండుగల విశిష్టతను చిన్నారులకు తెలియజేస్తూ సంప్రదాయ విలువలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ముందడుగు.. లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ







- **జమ్మికుంటలో వార్డుల వారీగా పత్రాలు అందించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్**

**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** పేద, మధ్య తరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా జమ్మికుంట పట్టణంలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు.
జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్, ఆయా వార్డుల కౌన్సిలర్లతో కలిసి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేశారు. సొంత ఇల్లు నిర్మించుకోవాలనే పేద, మధ్యతరగతి కుటుంబాల కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని చైర్మన్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఇళ్ల నిర్మాణ ప్రక్రియలో లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు కొలుగూరి సురంజన్, చింతల శ్రీనివాస్, కొలుగూరి సురేష్, ఫిరోజ్, పొనగంటి విష్ణు, లక్ష్మణ్, రమేష్, జానీ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

- **వీణవంకలో భారీ నిరసన..**
- **హామీల అమలుపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ధ్వజం**



**వీణవంక, సెప్టెంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు హుజూరాబాద్ నియోజకవర్గంలోని వీణవంక మండల కేంద్రంలో గురువారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సుమారు రెండు వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు, యువత హాజరయ్యారు.
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా 'కాంగ్రెస్ బాకీ కార్డు'లను ప్రజలకు పంపిణీ చేసి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు-వాటి అమలు తీరుపై ప్రజలకు వివరించారు.

**హామీలన్నీ అమలు చేయాలి**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో దేవుడి సాక్షిగా ప్రమాణాలు చేసి ప్రజలకు గ్యారెంటీ కార్డులు అందించిన కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పారని విమర్శించారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని ప్రజలను నమ్మించి, వెయ్యి రోజులు పూర్తయినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు.
రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్న ఆయన, యూరియా కొరత, రైతు సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం, సాగునీటి విషయంలో ప్రభుత్వ వైఫల్యంతో రైతాంగం నష్టపోతోందని అన్నారు. రైతు భరోసా, రెండు లక్షల రూపాయల రుణమాఫీ, వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ వంటి హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.
మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెంచిన పింఛన్లు, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా కార్డులు, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ వంటి హామీలను కూడా ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.
ప్రజలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బాకీలను వెంటనే చెల్లించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.
కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు హుజూరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని కౌశిక్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండ శ్రీనివాస్, వాల బాలకిషన్ రావు, ముసిపట్ల తిరుపతి రెడ్డి, మాడ సదావ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, కామిడి శ్రీనివాస్ రెడ్డి, సిద్ధిపల్లి మహిపాల్ రెడ్డి, నీల కుమారస్వామి, దాసరపు రాధాకృష్ణ, కాసర్ల సుధాకర్, జక్కు నారాయణ, ముత్యాల శంకర్, నాగిడి సంజీవ రెడ్డి, కాంతారెడ్డి మధుసూదన్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, అడిగిప్పుల సత్యనారాయణతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాప్రాలో 22ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కరించాలి




**కాప్రా, సెప్టెంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు-):** కాప్రా మండలంలోని 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో పాటు బ్యాంకు రుణాలు పొందలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి 6 గ్యారంటీల వైఫల్యాలపై నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి కాప్రా డివిజన్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్‌రెడ్డి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ధర్నా కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, మాజీ కార్పొరేటర్లు, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ రేగళ్ల సతీష్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. 22A భూముల సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు.

# బీమా భవిష్యత్తుకు ఆర్థిక భరోసా







- **రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబానికి రూ.13.50 లక్షల ఇన్సూరెన్స్ చెక్కు అందజేత**

**వనపర్తి,సెప్టెంబర్03(తెలంగాణ ముచ్చట్లు):** బీమా ప్రతి కుటుంబానికి భవిష్యత్తులో ఆర్థిక భరోసా కల్పిస్తుందని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ హెడ్ ఆఫీస్ మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి సునీల్ అన్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామంలో రావుల గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతుల కోసం ఒక సాయంత్రం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎం సతీష్, వనపర్తి జిల్లా బ్రాంచ్ మేనేజర్ రాకేష్, బ్రాంచ్ డీవోలు రాములు, వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ప్రతి మనిషికి జీవిత బీమా ఎంతో అవసరమని, అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు బాధిత కుటుంబానికి బీమా ఆర్థిక అండగా నిలుస్తుందని తెలిపారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామంలో 150 మందికి పైగా ఇన్సూరెన్స్ పాలసీదారులు ఉన్నారని, రావుల గోపాల్‌రెడ్డి కృషితో గ్రామంలోని రైతులు, ప్రజలకు బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డిని అభినందించారు. కానాయపల్లి గ్రామానికి చెందిన వడ్డే మనోజ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తరఫున రూ.13.50 లక్షల చెక్కును అందజేశారు. అలాగే ప్రతి నెలా రూ.6 వేల చొప్పున 18 సంవత్సరాల పాటు ఆ కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం అందుతుందని తెలిపారు. ప్రతిరోజూ చేసే ఖర్చుల్లో కొంత మొత్తాన్ని పొదుపు చేసి బీమా పాలసీ తీసుకుంటే అనుకోని ప్రమాదాలు, ఆపదల సమయంలో కుటుంబానికి ఆర్థిక భద్రత లభిస్తుందని సునీల్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి హాజరైన శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సిబ్బందికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భర్త సాయిలు, బీసీ సంఘం నాయకులు భీమన్న నాయుడు, గోకరయ్య, కుర్మయ్య, రమేష్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, బాజ గిరన్న, విష్ణురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమందడి – వనపర్తి రోడ్డు కోసం బీఆర్ఎస్ పాదయాత్ర



**పెద్దమందడిసెప్టెంబర్03(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రం నుంచి వనపర్తి పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారిని వెంటనే నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మండల నాయకుల ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం సమర్పించారు. ఏళ్లుగా రహదారి అధ్వానంగా ఉండటంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాయకులు తెలిపారు. గతంలో రోడ్డు అభివృద్ధికి సుమారు రూ.40 కోట్ల నిధులు మంజూరైనా పనులు పలుమార్లు ప్రారంభించి మధ్యలోనే నిలిచిపోయాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని పనులను వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని కోరారు. పాదయాత్రకు నిరంజన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. బీఆర్ఎస్ నేతలు చేపట్టిన పాదయాత్రకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. పాదయాత్రలో కొంతదూరం నడిచిన ఆయన, పెద్దమందడి-వనపర్తి ప్రధాన రహదారి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పెద్దమందడి–వనపర్తి రోడ్డు పనులు పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



- **పనులు కొనసాగుతుండగా బీఆర్ఎస్ పాదయాత్రలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది**
- **కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి**

**పెద్దమందడి,సెప్టెంబర్03(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి-వనపర్తి ప్రధాన రహదారి మరమ్మతు పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. గత రెండు రోజులుగా కొనసాగుతున్న రోడ్డు పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా కొమ్ము వెంకటస్వామి మాట్లాడుతూ.. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రహదారి అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. పెద్దమందడి-వనపర్తి ప్రధాన రహదారి అభివృద్ధికి సుమారు రూ.40 కోట్లతో పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పనులు ప్రారంభమై కొనసాగుతున్న సమయంలో బీఆర్ఎస్ నాయకులు పాదయాత్రల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు వాటికి సహకరించాల్సిందిపోయి రాజకీయ విమర్శలు చేయడం సమంజసం కాదని అన్నారు. పెద్దమందడి, ఖిల్లాఘనపూర్ మండలాల మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పెద్దమందడి-వనపర్తి రహదారి పనులు ప్రారంభం కావడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. రూ.40 కోట్ల వ్యయంతో చేపడుతున్న రహదారి పనులు పూర్తయితే నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు, రైతులు, వాహనదారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.రోడ్డు పనులు కొంతమేర సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమయ్యాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రస్తుతం సమస్యలను అధిగమించి పనులు ప్రారంభమైనందున ఎలాంటి ఆటంకాలు లేకుండా రహదారి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్ మాట్లాడుతూ పెద్దమందడి-వనపర్తి రహదారి ప్రజలకు ఎంతో కీలకమైనదని, ఈ మార్గంలో ప్రతి రోజూ అనేక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. రహదారి అధ్వానంగా ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం రూ.40 కోట్లతో చేపడుతున్న రహదారి పనులు పూర్తయితే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి చొరవతో ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే దిశగా అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని తెలిపారు.ప్రస్తుతం రహదారి పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రతిపక్షాలు రాజకీయ ఆరోపణలు చేయడం కంటే పనులు సక్రమంగా పూర్తయ్యేలా సహకరించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. రహదారి పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని వారు కోరారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యువతకు శ్రీకృష్ణుడి జీవితం ఆదర్శం



- **పలుస శంకర్‌గౌడ్, జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**

**వనపర్తి,సెప్టెంబర్03(తెలంగాణ ముచ్చట్లు):** యువత శ్రీకృష్ణుడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని స్నేహం, ధైర్యం, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని వనపర్తి జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. తిరుమలహిల్స్‌లోని రేడియంట్ హైస్కూల్‌లో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు.ద్వాపర యుగంలో అధర్మాన్ని నిర్మూలించి ధర్మాన్ని స్థాపించేందుకు శ్రీకృష్ణుడు అవతరించారని తెలిపారు. కృష్ణుడు గొప్ప స్నేహితుడు, మార్గదర్శకుడు, నాయకుడని, కుచేలుడితో స్నేహం, పాండవులకు అండగా నిలిచిన తీరు నేటి యువతకు ఆదర్శమని అన్నారు. రేడియంట్ హైస్కూల్‌లో కృష్ణాష్టమి సందర్భంగా కృష్ణుడి వేషధారణ పోటీలు, ఉట్టి కొట్టడం, కోలాటం, భజనలు, గీతా పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వీటి ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు, సంస్కృతి పట్ల అవగాహన పెరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ అహంకారం, అసూయ, కోపాన్ని విడనాడి ప్రేమ, కరుణ, సత్యాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కౌసల్య భాస్కర్, ప్రిన్సిపాల్ ఉప్పరి తిరుమలేష్, వైస్ ప్రిన్సిపాల్ బి. రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సాహితీ కళా వేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆటపాటలతో సందడిగా కృష్ణాష్టమి వేడుకలు






**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు-):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సెయింట్ థామస్ అల్టిట్యూడ్ హై స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు.వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చిన్నారుల నృత్యాలు, ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పుస్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి జీవితం, ఆయన బోధించిన ధర్మం, సత్యం, ప్రేమ, మానవతా విలువలను విద్యార్థులు తెలుసుకోవాలని అన్నారు. పాఠ్యాంశాలతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడం ద్వారా వారిలో నైతిక విలువలు పెంపొందుతాయని తెలిపారు. కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మర్రి అశోక్, వైస్ ప్రిన్సిపల్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఉపాధ్యాయులు సరిత, లావణ్య, మమత, కవిత, స్వప్న, గీత, కావ్య, కళ్యాణి, కృష్ణ, ఆశా బేగం, సురేష్, లలిత, సుమలత, రమేష్, రమ్య తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిరంజన్‌రెడ్డి ముందు మీ రికార్డు చూసుకోండి



- **ఎమ్మెల్యే మేఘారెడ్డిపై ఆరోపణలు చేసే ముందు వాస్తవాలతో మాట్లాడాలి**
- **కాంగ్రెస్ నాయకులు**

**పెద్దమందడి,సెప్టెంబర్03(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిపై ఆరోపణలు చేసే ముందు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తన హయాంలో జరిగిన భూ వ్యవహారాలను పరిశీలించుకోవాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదని, దమ్ముంటే ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామ శివారులోని భూముల విషయంలో బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు ఖండించారు. వెల్టూర్ గ్రామానికి చెందిన దానయ్య కుటుంబానికి సంబంధించిన భూమిని మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో మేఘారెడ్డి కొనుగోలు చేశారని, అనంతరం అదే భూమిని ఇతరులకు విక్రయించిన వ్యవహారంలో కూడా రఘుపతిరెడ్డి కీలకంగా వ్యవహరించారని తెలిపారు. ఈ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు 1987 నుంచి 2019 వరకు ఉన్నాయని, అవసరమైతే వాటిని ప్రజల ముందు ఉంచుతామని అన్నారు. అదేవిధంగా పెద్దమందడి మండలం వెల్టూర్ శివారులోని సర్వే నంబర్లు 345, 446లో కుమ్మరి వర్గానికి చెందిన భూముల విషయంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కుటుంబ సభ్యులపై కూడా పలు ప్రశ్నలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మూడు ఎకరాలకుపైగా భూమిని కొనుగోలు చేసి అదనంగా భూమిని ఆక్రమించారన్న ఆరోపణలపై మాజీ మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గిఫ్ట్ డీడ్, పన్నుల వ్యవహారంపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు.మేఘారెడ్డిపై భూ వ్యవహారాలకు సంబంధించి ఒక్క ఆరోపణైనా నిజమని నిరూపిస్తే తగిన సమాధానం చెబుతామని, నిరాధార ఆరోపణలు మాత్రం మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. రాజకీయ లబ్ధి కోసం ఫిర్యాదులు చేసినంత మాత్రాన అవాస్తవాలు వాస్తవాలు కావని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ధరణి, భూ వివాదాలు, పేదలు, దళితులు, బలహీన వర్గాల భూముల సమస్యలపై ఎందుకు స్పందించలేదని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత భూముల పేరుతో రాజకీయాలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ఆయనపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం వల్ల రాజకీయంగా ఎలాంటి ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. దమ్ముంటే ఆధారాలతో రండి.. ఆరోపణలు నిజమని నిరూపించండి. లేకపోతే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారం మానుకోండి అని కాంగ్రెస్ నాయకులు హితవు పలికారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వాల్య నాయక్, పెద్దమందడి మండల అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, వనపర్తి మండల అధ్యక్షుడు రవికిరణ్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డిఎస్ మహేష్, పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు గంధం రంజిత్‌కుమార్, సర్పంచ్ రవినాయక్, మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్, సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పదవులపై నాకు సోకు లేదు.. నా గౌరవం నాకు ఉంది

- **కష్టపడి ఈ స్థాయికి వచ్చా.. ఒక్క పోటుతో కూల్చేశారు**
- **డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**

**వనపర్తి,సెప్టెంబర్03(తెలంగాణ ముచ్చట్లు):** తనకు పదవులపై ఎలాంటి మోజు లేదని, కష్టపడి రాజకీయాల్లో ఈ స్థాయికి వచ్చానని, ఒక్క నిర్ణయంతో తనను పదవి నుంచి తొలగించారని ప్లానింగ్ కమిషన్ మాజీ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి అన్నారు. అధిష్ఠానం నిర్ణయంపై ఆయన స్పందిస్తూ తన రాజకీయ ప్రస్థానం, పదవి తొలగింపు పరిణామాలపై మాట్లాడారు.ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీని స్థాపించినప్పటి నుంచి తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నానని చిన్నారెడ్డి తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడి పనిచేశానని, ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకున్నానని అన్నారు. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌గా తనకు కూడా టిల్ ఫర్దర్ ఆర్డర్ అంటూ పదవి ఇచ్చారని పేర్కొన్నారు. పదవులు లేకపోయినా తన గౌరవం తనకు ఉంటుందని, పదవి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసే ప్రయత్నం కూడా తాను చేయలేదని స్పష్టం చేశారు. తన రాజకీయ జీవితం పదవుల కోసం కాదని, పార్టీ కోసం పనిచేయడమే తన లక్ష్యమని అన్నారు. ఇటీవల తన మనుషులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లిన సందర్భంలో వారిని మెడ పట్టి బయటకు పంపిస్తానని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారని చిన్నారెడ్డి ఆరోపించారు. అయినప్పటికీ తాను ఆ పరిణామాలను భరిస్తూ వచ్చానని తెలిపారు.కాంగ్రెస్ పార్టీతో తనకు ఉన్న అనుబంధం పదవులతో ముడిపడి లేదని, పార్టీ కోసం తాను ఎప్పటికీ పనిచేస్తూనే ఉంటానని చిన్నారెడ్డి స్పష్టం చేశారు. తనకు పదవులు పోయినా రాజకీయంగా తన ఆత్మగౌరవాన్ని, ప్రజల్లో తనకు ఉన్న గౌరవాన్ని ఎవరూ తొలగించలేరని అన్నారు.



# చిన్నారెడ్డిని పదవి నుంచి తొలగించడం బాధాకరం

- **40 ఏళ్ల కాంగ్రెస్ సేవలకు దక్కిన గౌరవం ఇదేనా?**
- **గట్టు మన్నెం, కాంగ్రెస్ నాయకులు**

**పెద్దమందడి,సెప్టెంబర్03(తెలంగాణ ముచ్చట్లు):** నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న సీనియర్ నాయకుడు చిన్నారెడ్డిని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగించడం బాధాకరమని కాంగ్రెస్ నాయకులు గట్టు మన్నెం అన్నారు.చిన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీకి కష్టకాలంలోనూ అండగా నిలిచి, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి సుదీర్ఘకాలం సేవలందించిన నాయకుడని తెలిపారు. పదవులు ఉన్నా లేకపోయినా పార్టీ కోసం పనిచేసిన ఆయనకు తగిన గౌరవం దక్కాల్సిన అవసరం ఉందన్నారు.నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో చిన్నారెడ్డి పార్టీ కోసం చేసిన సేవలు, పోషించిన పాత్రను కాంగ్రెస్ నాయకత్వం గుర్తించాలని గట్టు మన్నెం కోరారు. నీతి, నిజాయితీకి కట్టుబడి పనిచేసే సీనియర్ నాయకుడిగా చిన్నారెడ్డి పార్టీ కార్యకర్తల్లో ప్రత్యేక గౌరవం సంపాదించుకున్నారని పేర్కొన్నారు.ఇలాంటి సీనియర్ నాయకుడిని పదవి నుంచి తొలగించడం పార్టీ కార్యకర్తలను, అభిమానులను బాధించిందన్నారు. చిన్నారెడ్డి అనుభవాన్ని, సేవలను పార్టీ బలోపేతానికి వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. నాయకుల మధ్య అభిప్రాయ భేదాలు ఉంటే వాటిని అంతర్గతంగా చర్చించుకుని పరిష్కరించుకోవాలని, వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా సీనియర్ నాయకులను గౌరవిస్తూ అందరూ ఐక్యంగా పనిచేయాలని గట్టు మన్నెం సూచించారు. చిన్నారెడ్డికి తగిన గౌరవం కల్పించేలా పార్టీ నాయకత్వం పునరాలోచించాలని ఆయన కోరారు.



# ధర్మసాగర్ సీఐగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

**ధర్మసాగర్, సెప్టెంబర్3(తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ సీఐగా అనుముల శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ధర్మసాగర్‌కు వచ్చారు.గతంలో ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన శ్రీనివాస్‌కు ఈ ప్రాంతంపై మంచి అవగాహన ఉంది. ప్రస్తుతం అదే స్టేషన్‌కు సీఐగా బాధ్యతలు చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇంతకుముందు సీఐగా పనిచేసిన శ్రీధర్‌రావును ఏఆర్‌కు అటాచ్ చేయడంతో ఆయన స్థానంలో శ్రీనివాస్‌ను నియమించారు.

బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ధర్మసాగర్ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. నేరాల నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు పోలీసు శాఖ సేవలు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకుంటామని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని సీఐ శ్రీనివాస్ స్పష్టం చేశారు.





# ప్రజా–పోలీసు సంబంధాలు బలోపేతం కావాలి

- **ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు అడ్డూరి అనిల్ మాదిగ**

**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**ఎల్కతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కొండ్రు శ్రీనివాస్‌ను ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు అడ్డూరి అనిల్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సీఐకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అడ్డూరి అనిల్ మాదిగ మాట్లాడుతూ.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన పోలీస్ సేవలు అందించాలని కోరారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలను సానుకూలంగా విని, చట్ట పరిధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజా-పోలీసు సంబంధాలు మరింత బలోపేతం కావాలని, పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా నూతన సీఐ సేవలు అందించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

నూతన సీఐ కొండ్రు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎల్కతుర్తి సర్కిల్‌లో సమర్థవంతమైన పోలీసింగ్ కొనసాగి, అన్ని వర్గాల ప్రజలకు సమానంగా న్యాయం, రక్షణ అందాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీస్ శాఖకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు కొయ్యడ రాజేందర్ మాదిగ, అధికార ప్రతినిధి మారుపాక మధుకర్ మాదిగ, అంబాల రవీందర్ మాదిగ, మేకల రవీందర్ మాదిగ, అంబాల సంపత్ మాదిగ, పోగుల రమేష్ మాదిగ, జూపాక సదానందం మాదిగ, అడ్డూరి నవీన్ మాదిగ, అడ్డూరి ప్రశాంత్ మాదిగ, ఎర్రోళ్ల అనిల్ మాదిగ, నమిండ్ల నరేష్ మాదిగ, మంద అనిల్ మాదిగతో పాటు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ కార్యాలయంపై దాడికి నిరసన

- **హుజురాబాద్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం**

**హుజురాబాద్, సెప్టెంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని, గురు సంత్ రవిదాస్ చిత్రపటంపై నల్లరంగు పూసిన ఘటనను నిరసిస్తూ గురువారం హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

బీజేపీ ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు ఎర్ర శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

**ప్రజాస్వామ్యానికి విరుద్ధం**

ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు మాట్లాడుతూ రాజకీయ భేదాభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యక్తం చేయాలే తప్ప, రాజకీయ ప్రత్యర్థుల కార్యాలయాలపై దాడులకు పాల్పడటం సరికాదన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. గురు సంత్ రవిదాస్ చిత్రపటంపై నల్లరంగు పూయడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. ఈ ఘటన కోట్లాది ప్రజల మనోభావాలను, ముఖ్యంగా దళిత వర్గాల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. ఘటనకు బాధ్యులైన వారిపై ప్రభుత్వం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**దాడులను సహించేది లేదు**


అధికారంలో ఉన్నామనే అహంకారంతో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలను సహించేది లేదని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు, సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ మెంబర్ సబ్బని రమేష్, తిప్పబత్తిని రాజు, గంట సంపత్, కొలిపాక శ్రీనివాస్, నల్ల సుమన్, నరాల రాజశేఖర్, యాంసాని శశిధర్, యాళ్ల సంజీవరెడ్డి, వొడ్నాల విజయ్, ఇల్లందుల ప్రణీత్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఎర్ర శ్రీధర్, వివిధ మోర్చాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందకుంటలో కాంగ్రెస్‌కు భారీ షాక్.. బీఆర్ఎస్‌లోకి కీలక నేతల చేరిక

- **కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కండువా**

**ఇల్లందకుంట, సెప్టెంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇల్లందకుంట మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గొట్టె రాజశేఖర్, సిరిసేడు గ్రామానికి చెందిన ఎస్సీ సెల్ నాయకుడు రేనుకుంట్ల జానీ గురువారం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వారికి బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.





అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంపై ప్రజల్లో పూర్తి విశ్వాసం ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం గత ప్రభుత్వం చేసిన కృషిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకూ బలోపేతం అవుతోందని, రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. పార్టీలో చేరిన నాయకులు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నాయకత్వంలో పనిచేస్తామని, బీఆర్ఎస్ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ వెంకటేష్, సిరిసేడు సర్పంచ్ కుమార్ దామోదర్, మాజీ ఎంపీటీసీ చిన్న రాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఉద్యానవన రంగంలో యువతకు విస్తృత అవకాశాలు

**మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** ఉద్యానవన రంగంలో యువతకు ఉద్యోగ, స్వయం ఉపాధి, పారిశ్రామిక రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని హార్టికల్చర్ కళాశాల, మోజర్ల అసోసియేట్ డీన్ డా. వీణ జోషి తెలిపారు.జడ్చర్ల మండల కేంద్రంలోని డా. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన విస్తృత ఉపన్యాస కార్యక్రమానికి ఆమె ముఖ్య వక్తగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఉద్యానవన రంగం ప్రాధాన్యత, సాగు విధానాలు, ఆరోగ్య ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాలలో ప్రవేశపెట్టిన హార్టికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేపింగ్ (ఏఈడిపి) కోర్సు ద్వారా విద్యార్థులకు అనేక అవకాశాలు లభిస్తాయని తెలిపారు. నర్సరీల నిర్వహణ, పండ్లు, కూరగాయలు, పుష్పాలు, ఔషధ, సుగంధ మొక్కల సాగుతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. సుకన్య మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యానవన రంగంలో ఆధునిక సాంకేతికత, నూతన సాగు పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి డా. బి. నర్మద సేంద్రీయ పద్ధతుల్లో పండించే పండ్లు, కూరగాయల ప్రాధాన్యతను వివరించారు. తెలంగాణ బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డా. బి. సదాశివయ్య పర్యావరణహిత సాగు పద్ధతులపై వివరించారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను సందర్శించి మొక్కను నాటి నీరు పోశారు. కాక్టస్ హౌస్, షేడ్ నెట్ హౌస్‌లను సందర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళా శిశు సంక్షేమ, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జడ్చర్ల మండల పరిధిలోని ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బాల్య వివాహాల నిషేధ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సామాజికవేత్త రేణమ్మ విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, అనాథ బాలల దత్తత, పోక్సో చట్టం, బాలికల పట్ల అసభ్య ప్రవర్తన, ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లలకు ఏవైనా అసౌకర్యాలు ఎదురైతే 1098కు ఫోన్ చేయడంతో పాటు తమకు నచ్చిన ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు.




జెండర్ స్పెషలిస్ట్ మంజుల మాట్లాడుతూ ఎదిగే వయసులో ఆకర్షణలకు లోనుకాకుండా చదువుపై దృష్టి పెట్టాలని, తెలియని వ్యక్తులను నమ్మరాదని సూచించారు. 'బేటీ బచావో–బేటీ పడావో' కార్యక్రమంపై అవగాహన కలిగి ఉండాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు.

కార్యక్రమంలో హెచ్ఎం హరిహరనాథ్ ఉపాధ్యాయులు అబ్దుల్ అలీమ్, విజయ ప్రతాప్, హైమావతి, మంజుల, సంధ్య, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి టీఆర్ఎస్ నాయకులకు భయం పట్టుకుంది

- **డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్**

**మహబూబ్ నగర్ బ్యూరో సెప్టెంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** గత రెండున్నర ఏళ్లలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూస్తే టిఆర్ఎస్ కు భయం పట్టుకుందని డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ ఎద్దేవా చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో గురువారం డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ ప్రెస్‌మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కును ఎప్పుడో కోల్పోయిందని అన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఎంతవరకు నెరవేర్చారో, ఏ విధమైన అభివృద్ధి చేశారో ప్రజలకు బాగా తెలుసని తెలిపారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుంటే, ప్రజల్లో తమ ఉనికి కోల్పోతామనే భయంతో టీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు తమను పూర్తిగా మర్చిపోతారనే ఆందోళనతోనే వారు అనవసర విమర్శలకు దిగుతున్నారని పేర్కొన్నారు.




మొన్న నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి అన్ని రంగాల్లో వివరించామని తెలిపారు. ఏ అంశాన్ని తీసుకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితో పోటీ పడే పరిస్థితి వారికి లేదని అన్నారు. గతంలో ఎన్నో ఇళ్లు నిర్మించినట్లు చెప్పుకున్నారని, అయితే ఆ ఇళ్లు నిజంగా అర్హులైన పేదలకు ఎంతమందికి అందాయో ప్రజలే ప్రశ్నిస్తున్నారని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం కాకుండా తమ పార్టీ కార్యకర్తలకు ప్రయోజనం చేకూర్చే విధంగా గత ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. ప్రజా సంక్షేమం కంటే స్వప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చిన పాలన గతంలో కొనసాగిందని పేర్కొన్నారు.

అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నిజంగా ప్రజల కోసం పనిచేస్తోందని తెలిపారు. పేదలు, రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు సహా అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని అన్నారు. "మేము ఏం చేశామో ప్రజలకు తెలుసు... గతంలో వారు ఏం చేశారో కూడా ప్రజలకు తెలుసు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వచ్చిన మార్పును ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారు" అని సంజీవ్ ముదిరాజ్ అన్నారు. టీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలు కేవలం ప్రజల్లో తమ ఉనికిని చాటుకునేందుకే తప్ప, ప్రజా సమస్యలపై నిజమైన చిత్తశుద్ధితో చేస్తున్నవి కావని విమర్శించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు చేయలేని పనుల గురించి ఇప్పుడు మాట్లాడటం వల్ల ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.ప్రజల సమస్యలు, ప్రజల బాధలు, ప్రజల ఆకాంక్షలపై కాంగ్రెస్ నాయకులు నిరంతరం పోరాడుతున్నారని తెలిపారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే బాధ్యతతో కాంగ్రెస్ పార్టీ నిరంతరం ముందుకు సాగుతుందని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ పేర్కొన్నారు.




# ఉద్యోగుల హక్కుల కోసం ఐసీఈయూ పోరాటం

- **హుజురాబాద్ బ్రాంచ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక**

**హుజురాబాద్,సెప్టెంబర్ 3(తెలంగాణ ముచ్చట్లు ):** ఎల్ఐసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసీఈయూ) నిరంతరం అండగా నిలుస్తుందని కరీంనగర్ డివిజన్ నాయకులు వామన్‌రావు, బసవేశ్వర్ తెలిపారు.

గురువారం హుజురాబాద్‌లో ఐసీఈయూ బ్రాంచ్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని నాయకులు సూచించారు.

**నూతన కార్యవర్గం**

బ్రాంచ్ అధ్యక్షుడిగా ఆకుల చందర్, ఉపాధ్యక్షుడిగా మేకల ప్రేమ్‌కుమార్, కార్యదర్శిగా వంకుడోతు కరుణాకర్ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా బి. రవికుమార్, ఎం. వివేక్, కోశాధికారిగా రుద్రారపు కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

**ఏకగ్రీవంగా ఇతర సభ్యుల ఎన్నిక**

జనరల్ కౌన్సిల్ మెంబర్‌గా బొంకూరి కుమార్ ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా ఋషిత రెడ్డి, అనిల, గోపికిషోర్, గోరెమియా, ఆశిష్ వర్ధన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా డివిజన్ నాయకులు మాట్లాడుతూ ఎల్ఐసీ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఐసీఈయూ కృషి చేస్తుందని తెలిపారు. ఉద్యోగుల హక్కులకు భంగం కలిగే అంశాలపై సంఘం తరపున సమర్థవంతంగా పోరాడుతామని పేర్కొన్నారు. నూతన కార్యవర్గం ఉద్యోగులందరినీ సమన్వయం చేసుకుంటూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఆల్ఫోర్స్‌లో కృష్ణాష్టమి సందడి

- కృష్ణుడి వేషధారణలో చిన్నారులు



**హుజురాబాద్,సెప్టెంబర్ 3(తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ పట్టణంలోని ఆల్ఫోర్స్ జీనియస్ పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పండగ వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. ఉట్టి వేడుకలను ఉత్సాహంగా నిర్వహిస్తూ విద్యార్థులు సందడి చేశారు. శ్రీకృష్ణుడి బాల్య లీలలను ప్రతిబింబించే నృత్య రూపకాలు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీకృష్ణుడి జీవితం నుంచి విద్యార్థులు ధైర్యం, ధర్మపోరాట స్ఫూర్తిని నేర్చుకోవాలని సూచించారు. చదువులో, ఆటల్లో ఎలాంటి కష్టాలు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలని అన్నారు.

శ్రీకృష్ణాష్టమికి విశిష్టమైన చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ధర్మం వైపు నిలిచి, అధర్మాన్ని ఎదుర్కొనే స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారం పోయిందనే అక్కసుతోనే విమర్శలు

- బీఆర్ఎస్ హయాంలో ఎన్ని హామీలు అమలు చేశారు?



**హుజురాబాద్,సెప్టెంబర్ 3(తెలంగాణ ముచ్చట్లు ):**అధికారం కోల్పోయామనే అక్కసుతోనే బీఆర్ఎస్ నాయకులు ప్రజా ప్రభుత్వంపై దిగజారుడు విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ నాయకుడు ఎండి ఇమ్రాన్ మండిపడ్డారు. గురువారం హుజురాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎంతోమంది బలిదానాలతో ఏర్పడిన తెలంగాణలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. దళితులకు మూడు ఎకరాల భూమి, రైతులకు ఉచితంగా ఎరువులు ఇస్తామని ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిందా? అని ప్రశ్నించారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారని, ధరణి పేరుతో రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. ప్రాజెక్టుల పేరుతో రాష్ట్ర ఖజానాను లూటీ చేసి మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని ఇమ్రాన్ పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

# బొల్లారం ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో హనీట్రాప్ కోణం?

- ఆర్మీ సిబ్బంది సామాజిక మాధ్యమ ఖాతాలపై నిఘా
- చోరీ వెనుక పక్కా ప్రణాళిక ఉన్నట్లు అనుమానాలు
- డిటోనేటర్ల లభ్యంతో దర్యాప్తులో కొత్త మలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 03, (తెలంగాణ ముచ్చట్లు): బొల్లారం ఆర్మీ కేంద్రంలో జరిగిన ఆయుధాల చోరీ కేసు దర్యాప్తులో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఘటన వెనుక హనీట్రాప్ ఉండొచ్చన్న అనుమానంతో దర్యాప్తు సంస్థలు విచారణను ముమ్మరం చేశాయి. ఆర్మీ సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని కీలక సమాచారాన్ని సేకరించి, ఆ తర్వాత ఆయుధాల చోరీకి పాల్పడ్డారా అనే దిశగా పోలీసులు, కేంద్ర నిఘా సంస్థలు ఆరా తీస్తున్నాయి.

మద్రాస్ రెజిమెంట్‌లోని ఆయుధాగారం నుంచి నాలుగు ఏకే203 రైఫిళ్లు, ఏడు పిస్తోళ్లు, ఒక ఇన్సాస్ రైఫిల్‌తో పాటు వాటికి సంబంధించిన తూటాలను కూడా దుండగులు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. ఆయుధాల వివరాలు, భద్రతా ఏర్పాట్లు, నిల్వ ప్రాంతాలపై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తుల సహకారంతోనే ఈ చోరీ జరిగి ఉండవచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెజిమెంట్‌లో పని చేస్తున్న సిబ్బంది మొబైల్ ఫోన్లు, ఫోన్ కాల్ రికార్డులు, కాంటాక్ట్స్, సామాజిక మాధ్యమ ఖాతాల కార్యకలాపాలను కేంద్ర నిఘా బృందాలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇటీవల అనుమానాస్పద వ్యక్తులతో ఎవరైనా సంబంధాలు కొనసాగించారా, సున్నితమైన సమాచారం లీక్ అయిందా అనే అంశాలపై దర్యాప్తు సాగుతోంది.

ఇదే సమయంలో ఆర్మీ క్యాంపు సమీపంలోని ఫైరింగ్ రేంజ్ వెనుక గోడ దగ్గర ఒక బకెట్‌లో 160 ఎలక్ట్రికల్ డిటోనేటర్లు లభ్యమవడం కేసులో మరింత ఉత్కంఠ రేపుతోంది. ఆయుధాల చోరీకి, డిటోనేటర్ల లభ్యానికి ఏదైనా సంబంధం ఉందా అనే కోణంలో కూడా అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ఘటన జరిగి 48 గంటలు గడిచినా ఇప్పటివరకు కీలక ఆధారాలు లభించకపోవడంతో పోలీసులు, ఆర్మీ అధికారులు, కేంద్ర నిఘా సంస్థలు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టాయి. సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాలు, అనుమానితుల కదలికలను విశ్లేషిస్తూ కేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాలు కృషి చేస్తున్నాయి. ఆయుధాల చోరీ వెనుక ఉన్న అసలు ముఠా, వారి ఉద్దేశాలపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.



# స్విమ్మింగ్ పూల్‌కు సీసీ రోడ్డు.. అధికారుల మౌనం ఎందుకు?

**జవహర్‌నగర్, సెప్టెంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూమి వినియోగంపై వివాదం నెలకొంది. సుమారు అర ఎకరా, అంటే దాదాపు 2 వేల చదరపు గజాల ప్రభుత్వ స్థలంలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణం చేపట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాజాగా ఆ స్విమ్మింగ్ పూల్‌కు కార్లు వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.

జవహర్‌నగర్ గ్రామపంచాయతీగా ఉన్న కాలం నుంచి ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వచ్చినా.. 30 నుంచి 35 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు మాత్రం కనీస రహదారి సౌకర్యాల కోసం ఇబ్బందులు పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అనేక ప్రాంతాల్లో తమ ఇళ్ల ముందు అడుగు లోతు గుంతలు, గోతులతో కూడిన మట్టి రోడ్లే దిక్కుగా ఉన్నాయని వారు చెబుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ భూమిలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి, దానికి సీసీ రోడ్డు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వడంపై స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. పదవులు, పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వ భూమిని ప్రైవేటు అవసరాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ నిర్మాణానికి సంబంధించి అనుమతులు ఉన్నాయా? భూమి వినియోగానికి ఎవరు అనుమతి ఇచ్చారు? సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు ఎలా మంజూరయ్యాయి? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి.మరోవైపు నిర్మాణ వ్యవహారంపై మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అధికారులు వెంటనే స్పందించి, స్థలాన్ని పరిశీలించి, నిర్మాణానికి సంబంధించిన అనుమతులు మరియు భూమి హక్కులను పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణం ఉన్నట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అసలు ప్రభుత్వ భూమిలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? సీసీ రోడ్డు నిర్మాణానికి ఎవరు నిధులు కేటాయించారు? అధికారుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# కొండా సురేఖ బర్తరఫ్‌కు సీఎం సిఫార్సు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం నిర్ణయంతో ముగిసిన వివాదం

కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలన్న అంశం గత కొంతకాలంగా కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. ఆమె రాజీనామా చేసేందుకు నిరాకరించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి నేరుగా గవర్నర్‌కు లేఖ రాయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో మంత్రి పదవి కొనసాగింపుపై నెలకొన్న అనిశ్చితికి తెరపడినట్లైంది. ఈ పరిణామం తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అంశంపై పార్టీ అధిష్ఠానం కఠిన వైఖరిని ప్రతిబింబిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**కీలక పదవుల్లో మార్పులు**

ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు కీలక నియామకాలను ప్రకటించింది. తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించింది. అలాగే తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కొత్త చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారదను ప్రభుత్వం నియమించింది. ఇటీవల పార్టీ నేతల మధ్య నెలకొన్న వివాదాల నేపథ్యంలో ఈ మార్పులు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

**- తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త చర్చ**

కొండా సురేఖ బర్తరఫ్ అంశం తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త చర్చకు దారితీసింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవన్న సంకేతాన్ని అధిష్ఠానం పంపిందని నేతలు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు కొండా సురేఖ తదుపరి రాజకీయ అడుగులు ఎలా ఉంటాయన్న అంశంపై కూడా ఆసక్తి నెలకొంది. ఆమె భవిష్యత్ వ్యూహం, పార్టీ స్పందనపై రాజకీయ వర్గాలు దృష్టి సారించాయి.

# బర్తరఫ్ నిర్ణయంపై కొండా సురేఖ ఆవేదన

(మొదటి పేజీ తరువాయి)

తన అభిప్రాయాలను పార్టీ పెద్దల ముందు ఇప్పటికే వెల్లడించానని, అయినప్పటికీ తన మాటకు ప్రాధాన్యం ఇవ్వలేదని చెప్పారు.

రాష్ట్ర కేబినెట్‌లో ఉన్న మంత్రులందరూ సంతృప్తిగా లేరని కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. చాలా మంది తమ మనసులో ఉన్న అసంతృప్తిని బయటపెట్టలేకపోతున్నారని అన్నారు. ధైర్యంగా ముందుకు వచ్చి ప్రజల ముందు వాస్తవాలు చెప్పాలని ఆమె సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై రాష్ట్రవ్యాప్తంగా అసంతృప్తి ఉందని, దానిపై సమీక్ష నిర్వహించి లోపాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తానే పదేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగుతానని ప్రకటించడం సరైన రాజకీయ సంస్కృతి కాదని ఆమె అభిప్రాయపడ్డారు. భవిష్యత్ ఎన్నికల్లో అభ్యర్థుల గురించి ముందుగానే వ్యాఖ్యానించడం కూడా తగదన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీని, ఇందిరా గాంధీని విమర్శించిన పలువురు నేతలకు కూడా పార్టీ పదవులు లభించాయని గుర్తు చేశారు. తన విషయంలో మాత్రం వేరే ప్రమాణాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు.

కొంతమంది నేతలపై తీవ్ర ఆరోపణలు వచ్చినప్పటికీ వారికి కీలక బాధ్యతలు అప్పగించారని కొండా సురేఖ అన్నారు. తనపై మాత్రం కావాలనే లక్ష్యంగా చేసుకుని చర్యలు తీసుకున్నారని విమర్శించారు. తన కుటుంబ సభ్యుడు సుమంత్‌పై నమోదు చేసిన కేసును ఉపసంహరించుకోవాలని రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులను కోరారు. కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేసే చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తనను బర్తరఫ్ చేసినట్లు ప్రచారంలో ఉన్న



లేఖపై కూడా కొండా సురేఖ సందేహాలు వ్యక్తం చేశారు. ఆ లేఖలో సరైన చిరునామా, అధికారిక సంతకం లేవని పేర్కొన్నారు. అలాంటి పత్రాలను ఎవరు వైరల్ చేస్తున్నారో దర్యాప్తు జరగాలని కోరారు. అదే సమయంలో మహిళలకు, వెనుకబడిన వర్గాలకు కీలక పదవులు ఇవ్వడం సంతోషకరమని పేర్కొన్నారు. వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే చర్యలను స్వాగతిస్తున్నానని ఆమె తెలిపారు.

# 22ఏ నిషేధిత జాబితాపై ప్రభుత్వానికి ఈటల రాజేందర్ హెచ్చరిక

- పేదల భూములను వెంటనే జాబితా నుంచి తొలగించాలని డిమాండ్
- ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు
- ఇందిరాపార్క్ వద్ద దీక్షలకు బీజేపీ పిలుపు

**శామీర్‌పేట్, సెప్టెంబర్ 3, (తెలంగాణ ముచ్చట్లు):**



మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 22ఏ నిషేధిత జాబితాపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ధరణి పోయినా ప్రభుత్వ ధోరణి మారలేదని, భూభారతి పేరుతో ప్రజల ఆస్తులపై ఆంక్షలు విధిస్తూ భూహారతి చేస్తున్నారని ఆరోపించారు. 22ఏ నిషేధిత జాబితా కారణంగా లక్షలాది మంది ప్రజలు తమ భూములు, ఇళ్ల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గం మినీ ఇండియాగా పేరొందిందని, దేశంలోని వివిధ రాష్ట్రాలు, ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారని ఈటల రాజేందర్ అన్నారు. అలాంటి ప్రాంతాల్లో వందలాది కాలనీలను 22ఏ పరిధిలోకి తీసుకురావడం వల్ల ప్రజలు తమ ఆస్తులను విక్రయించలేక, బ్యాంకుల నుంచి రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పి అండ్ టి కాలనీ, మహేంద్రహిల్స్ వంటి ప్రాంతాలు కూడా నిషేధిత జాబితాలో చేరడం ప్రజల్లో తీవ్ర ఆందోళనకు కారణమైందన్నారు.

22ఏ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని తాము కోరడం లేదని, పేదలు, మధ్యతరగతి ప్రజలకు చెందిన భూములు, ఇళ్లను మాత్రమే నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 90 లక్షల మంది ఈ సమస్యతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆస్తి హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ పాలకులు స్పందించడం లేదని ఈటల రాజేందర్ విమర్శించారు. తప్పు అధికారులు చేస్తే వారిపై చర్యలు తీసుకోవాలని, అదే తప్పు ప్రభుత్వం చేస్తే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.

ప్రభుత్వం వెంటనే 22ఏ అంశాన్ని సమీక్షించి, అర్హులైన భూ యజమానులకు ఉపశమనం కల్పించాలని ఈటల రాజేందర్ కోరారు. ప్రజల జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. మాటలతో కాలయాపన చేయకుండా సమస్య పరిష్కారానికి స్పష్టమైన చర్యలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. 22ఏ బాధితుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని ఈటల రాజేందర్ ప్రకటించారు. ఈ నెల 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. బాధితులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ హక్కుల కోసం గళం వినిపించాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in